
చివ్వెంల మండల కేంద్రంలో బారులుదీరిన ఓటర్లు


చివ్వెంల : బండమీదిచందుపట్లలో ఓటు హక్కు వినియోగించుకుని సిరా వేలు చూపుతున్న యువకులు


ఆత్మకూర్.ఎస్ : బొప్పారంలో ఓటు హక్కు వినియోగించుకున్న జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్

# పోలింగ్ 84.83 శాతం

**జిల్లాలో సజావుగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ**

- 2018 కంటే పెరిగిన పోలింగ్ శాతం
- తుంగతుర్తిలో అత్యధికంగా 87.51 శాతం పోలింగ్ నమోదు
- సూర్యాపేట అత్యల్పంగా 79.95 శాతం మాత్రమే పోలింగ్
- ఉదయం నుంచే బారులు తీరిన ఓటర్లు
- మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటెత్తిన ఓటర్లు
- కొన్నిచోట్ల రాత్రి వరకు కొనసాగిన పోలింగ్
- ఈవీఎంలలో భద్రంగా 92 మంది అభ్యర్థుల భవితవ్యం

సూర్యాపేట, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జిల్లాలో 84.83 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లా వ్యాప్తంగా సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నాలుగు నియోజక వర్గాలు కలిపి 9,85,962 మంది ఓటర్లు ఉండగా ...... మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటలకు మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ గంట గంటకు పెరుగుతూ వచ్చింది. మధ్యాహ్నం తర్వాత ఓటర్లు పోలింగు కేంద్రాలకు క్యూ కట్టారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఓటర్లు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ సమయం ముగియగా అప్పటి వరకు పోలింగ్ కేంద్రాల వద్దకు వచ్చిన ఓటర్లకు టోకెన్లు అందజేసి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేంత వరకు పోలింగ్ కొనసాగింది. జిల్లాలో అత్యధికంగా తుంగతుర్తి నియోజకవర్గంలో 87.51 శాతం పోలింగ్ నమోదు కాగా అత్యల్పంగా సూర్యాపేట నియోజక వర్గంలో 79.95 శాతం నమోదైంది.

## గంట గంటకు పెరిగిన పోలింగ్..

పోలింగ్‌కు సంబంధించి ప్రతి రెండు గంటలకు ఒకసారి అధికారులు పోలింగ్ శాతాన్ని విడుదల చేశారు. ఈ ప్రకారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ 9 గంటల వరకు జిల్లాలో 9.48 శాతం నమోదు కాగా 11 గంటలకు 22.58 శాతానికి చేరుకున్నది. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు 44.14 శాతానికి, 3 గంటలకు 62.07 శాతానికి, 5 గంటలకు వరకు 74.88 శాతంగా నమోదైంది. అప్పటికే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు టోకెన్లు అందజేయగా రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. దాంతో జిల్లాలో పోలింగ్ శాతం.....కు చేరుకున్నది.


పెన్‌పహాడ్ : గాజులమల్కాపురంలో ఓటు వేయడానికి బారులుదీరిన ఓటర్లు

## జిల్లాలో 1.72 శాతం తగ్గిన పోలింగ్

2014లో 80.52 శాతం, 2018లో 86.55 శాతం 2023లో 84.83 శాతం పోలింగ్ జరిగింది.

జిల్లాలో గత అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చూస్తే ఈసారి 1.72 శాతం పోలింగ్ తగ్గింది. 2014 ఎన్నికల నాటికి సూర్యాపేట జిల్లా ఏర్పాటు కాక పోగా నాడు ప్రస్తుత జిల్లా పరిధిలోని సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నాలుగు నియోజక వర్గాల పరిధిలో 8,73,176 మంది ఓటర్లు ఉండగా 7,02,808 మంది ఓటింగులో పాల్గొనగా 80.52 శాతంగా పోలింగ్ నమోదైంది. 2018లో జరిగిన ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా 8,82,736 మంది ఓటర్లు ఉండగా 7,63,917 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో నాడు 86.55 శాతంగా పోలింగ్ నమోదైంది. అలాగే తాజాగా గురువారం జరిగిన పోలింగ్‌లో 9,85,962 మంది ఓటర్లు ఉండగా 7,88,276 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సారి ఎన్నికల్లో 84.83 శాతం పోలింగ్ నమోదైంది. 2014 ఎన్నికలతో పోల్చితే 2018 నాటికి 6.03 శాతం పెరుగగా ఈ సారి అంటే 2023 ఎన్నికల్లో గత ఎన్నికలతో పోల్చితే 1.72 శాతం తగ్గింది.

| నియోజక వర్గం | ఓటర్లు | | | ఓట్లు నమోదు | | | పోలింగ్ శాతం | | | పెరిగిన/తగ్గిన శాతం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | 2014 | 2018 | 2023 | 2014 | 2018 | 2023 | 2014 | 2018 | 2023 | 2023 |
| సూర్యాపేట | 2,16,157 | 2,11,037 | 2,41,799 | 1,70,463 | 1,80,120 | 1,93,381 | 78.86 | 86.06 | 79.95 | – 6.11 |
| తుంగతుర్తి | 2,23,606 | 2,31,376 | 2,55,017 | 1,73,724 | 1,98,775 | 2,23,163 | 77.69 | 85.91 | 87.51 | 1.60 |
| కోదాడ | 2,13,272 | 2,16,703 | 2,41,554 | 1,79,919 | 1,92,128 | 2,02,905 | 84.36 | 88.66 | 85.38 | –3.28 |
| హుజూర్‌నగర్ | 2,20,141 | 2,23,620 | 2,47,592 | 1,78,702 | 1,92,894 | 2,13,702 | 81.18 | 86.26 | 86.31 | 0.03 |

## ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

సూర్యాపేట, నవంబర్ 30 : సూర్యాపేట నియోజక వర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. నియోజక వర్గంలోని సూర్యాపేట పట్టణం, చివ్వెంల, పెన్‌పహాడ్, ఆత్మకూర్(ఎస్), సూర్యాపేట రూరల్ మండలాల పరిధిలో 271 పోలింగ్ కేంద్రాలు ఉండగా వాటిలో 2,41,799 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో ...... మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్థానిక శ్రీ చైతన్య స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి బేబీ మూన్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేయగా బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు కృష్ణకాలనీలో ఓటు వేశారు.

## ఈ నెల 3వ తేదీన కౌటింగ్.

ఇక ఈ నెల 3న ఆదివారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో ఓట్ల లెక్కింపు జరుగనుంది. ఆదివారం ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభిస్తారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్లతో ఓట్ల లెక్కింపు మొదలుకానున్నది. తర్వాత ఒక్కో రౌండ్‌లో 14 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలను 14 టేబుళ్లపై లెక్కించనున్నారు. ఉదయం 10 గంటల వరకు ఫలితాల సరళి వెల్లడి కానుండగా మధ్యాహ్నం ఒంటి గంట వరకే మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తి కానున్నదని అంచనా.


సూర్యాపేటలో ఓటు వేసి సిరాను చూపిస్తున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్


సూర్యాపేట : ఓటు వేసి సిరాను చూపిస్తున్న అదనపు కలెక్టర్ ప్రియాంక


సూర్యాపేట సిటీ : జిల్లా కేంద్రంలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే


ఆత్మకూర్.ఎస్ : నెమ్మికల్‌లో బారులుదీరిన ఓటర్లు


సూర్యాపేట రూరల్ : ఎండ్లపల్లిలో ఓటు వేసేందుకు బారులుదీరిన మహిళలు


సూర్యాపేట రూరల్ : ఎర్కారంలో ఓటు వేసేందుకు క్యూలైన్‌లో నిల్చున్న ఓటర్లు


పెన్‌పహాడ్ : చెట్లముకుందాపురంలో ఓటు వేసి సిరా చూపిస్తున్న యువత